# కుక్కకాటుకు చెప్పుదెబ్బ

రచన :
శ్రీ ఆరవెల్లి ప్రభాకరరావు.

ఆ రోజు మాఘ బహుళ సప్తమీ శనివారం. రాత్రి గం. 11-31 నిమిషాలకు స్వాతి నక్షత్ర ధనుర్లగ్న పుష్కర ఘడియలు అవి.

మామిడితోరణాలతో, రంగుకాగితాల రవళింపులతో, పెళ్ళిపందిరి కళకళ లాడుతున్నది.

దిక్కులు పిక్కటిల్లేట్లు మంగళకరవాయిద్యాలు మారు మ్రోగుతున్నాయి.

రకరకాల చీరలను సింగారించుకున్న భామలు సీతాకోక చిలకల్లా పందిరల్లా చుట్లు బెడుతున్నారు మందహాసాలు చిందిస్తూ.

గ్రామఫోను సినిమాపాటలు చెవ్వులు చిల్లులు చేస్తున్నాయి.

పిడుగులాంటి గద్దింపుతో, విజయభేరిల్లా మ్రోగుతున్న భజంత్రీలు తారాస్థాయినందుకున్న పంతుళ్ళ పనసలు.

కళ్ళలో పెళ్ళిపందిరి శ్రావ్యంగా వినిపిస్తున్న గ్రామఫోను రికార్డు.

అంతే సడన్‌గా ఎక్కడిదక్కడ ఆగిపోయాయి.

వాటితోపాటు రెండుచేతుల్తో వసుపుత్రాడు పట్టుకుని శతమానధారణ చెయ్యటానికి ఉపయుక్తుడవుతున్న పెళ్ళికొడుకు 'ఆనందం' కూడా యాంత్రికంగా ఆగిపోక తప్పలేదు.

ఆనందంతో పరుగులు పెడుతున్న పున్నమిచంద్రుణ్ణి కసితో కప్పేసిన మేఘంలా, ఏదో తెలియని ఉత్సాహంతో పరధ్యానంగావున్న పరంధామయ్యను ఒక్కసారిగా చీకటి ఆవరించేసింది. తను ఎంతైతే భయపడ్డాడో అంతా జరిగింది. యిలా జరుగుతుందనే భయంకొద్దీ....పదిమందిలో ఎక్కడ తల వంచుకోవలసి వస్తుందోనన్న అనుమానంతో పట్టరానివాడి కాళ్లుపట్టి విశ్వప్రయత్నం చేశాడు పాపం, పరంధామయ్య, కాని అనుకున్నంతా అయింది. ఒక్క వెయ్యిరూపాయలు కొరతా సరిపెట్టలేకపోయాడు, ఎంతమంది ఎన్నివిధాల నచ్చచెప్పినా వినకుండా కోపంతో బుసలు కొడుతున్నాడు మగబిడ్డతండ్రి భూషయ్య.

యిపుడేం దారి ? అమాంతంగా పీటలమీద పెళ్ళి ఆగిపోతే ! తనపరువూ, తనకూతురు బ్రతుకు ? పరంధామయ్య గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నా ధైర్యంతెచ్చుకుని భూషయ్యను సమీపిస్తూ....

క్షమించండి. మీఋణం వుంచుకోను. వ్యవధిచాలక సర్దుకోలేకపోయాను. తల తాకట్టు పెట్టయినా అనుకున్నది పూర్తి చేస్తాను. నామాట నమ్మండి బావగారు. ప్రాధేయపడ్డాడు. చెమ్మగిల్లిన కళ్ళతో పరంధామయ్య.

'నేను ముందే చెప్పానుకదా ! పైసాకూడా కొరతా చెయ్యటానికి వీల్లేదని. మరిపుడు వెయ్యిచాలదు, ఐదు వందలు చాలదు అని మొండిచెయ్యి చూపిస్తే ఎలా ? నేను అన్నమాట తప్పను. అనుకున్నది పైసలతో చేతిలో పెడితేనే' అన్నాడు భూషయ్య.

'అంత శిక్ష వెయ్యకండి. ఆడపిల్ల కలవాళ్ళం, అమాంతంగా పీటలమీద పెళ్ళి ఆగిపోతే మేం తలెత్తుకుని ఎలా తిరగ్గలం ?' బ్రతిమాలాడు.

'ఆహా. మరి మాసంగతో ! అనుకున్న కట్నం అందకపోతే, మగపెళ్ళివారం పదిమందిలో మా పరువేంకాను ?' రెచ్చిపోయాడు.

'బాబ్బాబూ ! యివి చేతులుకావు. ముహూర్తం మించిపోతుంది. సూత్రధారణ కానివ్వండి.' రెండుచేతులూ పట్టుకున్నాడు బ్రతిమాల్తూ ఆడపిల్లను కన్న నేరానికి.

'అబ్బో, గడుసువాడివేనయ్యో. ఏమిటో అనుకున్నాను' అందుకనే వుంది అసలు పట్టు. ఆ కాస్తపని అయిపోతే యింకేముంది ? నీ వెంట్రుకలు పట్టుకుని వేలబడాలి, యిదుగో ఆఖరిసారిగా చెపుతున్నాను. యీ ముహూర్తానికే నీ కూతురుమెళ్ళో తాళిబొట్టు బడాలీ అంటే, సొమ్ము పైసా కూడా తక్కువలేకుండా ముప్పయి వేలు ఈచేతిలో పెట్టాలి. మరట్టే విసిగించక ఆలోచించుకో.' చేతులు విదిలించాడు మొండిఘటం భూషయ్య.

మరి వరసగా అందర్నీ మగపిల్లల్నే కన్నాడుకదా ! 'ఎద్దుపుండు కాకికేం తెలుస్తుంది ?'

చేతులు విదిలించేసరికి పరంధామయ్యకు పట్టరానికోపం వచ్చింది. కాని గుండెలమీద కుంపటిలా ఎదురుగా కనిపిస్తున్న కూతుర్నిచూసి చల్లారిపోయాడు. తనలోతానే తమాయించుకున్నాడు.

* * *

అసలు ఆడపిల్ల 'క్యాం' మంటూ భూమ్మీద పడిన్నాడే ప్రతితండ్రి సిగ్గు, లజ్జా, పౌరుషం. పంతం లాకప్పులో పెట్టక తీరదు యీరోజుల్లో.

మరి పరంధామయ్య పరిస్థితికూడా డిటో.

'కొరతా సొమ్ముకు ప్రోనోటు రాసిస్తాను, నా పరువు కాపాడండి బావగారు.' పట్టువదలని విక్రమార్కుడులా మళ్ళా ప్రయత్నించాడు పరంధామయ్య. ఏం సమాధానం వినాల్సివస్తుందో నన్న భయంతో.

అనుకున్నంతా అయింది.

'యిదెక్కడి దరిద్రమయ్యా ! ముష్టి ముప్ఫయివేలు కోసం, ముక్కూ నోటా ఏడ్చి ముప్ఫయిమందిచేత రాయ భారాలు జరిపిస్తే. సరేనని తలూపాను, తీరా అసలుఘడియ వచ్చేసరికి ప్రోనోటు రాసిస్తాను, అది చేస్తాను, ఇది చేసాను అంటే నా ప్రిస్టేజి ఏంకాను ? ఎవరిక్కావాలా ప్రోనోటు కావాలంటే నేనూ రాసిస్తాను నీకు ప్రోనోటు—అను కున్నకట్నం యివ్వగల్గిననాడు నీ కూతురు నా యింటి కోడలుగా అంగీకరించటానికి ఎట్టి అభ్యంతరం లేదని.

యిది నీకు న్యాయంకాదు బావగారూ !'

'యిందులో అన్యాయమేముంది ? నాక్కావలసింది కట్నం. అది పారేసి కన్యాదానం చేసుకోమంటున్నాను. అంతే. అది తప్పా ? మగబిడ్డ తండ్రిగా నాకా అధికారం లేదా ? ఉండకూడదా ?' కళ్ళద్దాలు సర్దుకుంటూ దర్జాగా ఓపోజు విసిరాడు.

వేటకాడు మెత్తనయితే లేడి మూడుకాళ్ళతో గెంతిం దట. అలా పరంధామయ్య అలుసు కనిపెట్టిన భూషయ్య ఏమైనా అంటాడు.

కాళ్ళా వేళ్ళాబడి ఎంత బ్రతిమాలుకున్నా కరగని రాతి మనసుగల భూషయ్యతో వాదిస్తూ కూర్చుంటే ముహూర్తం మించిపోతుంది. అలా జరగటానికి వీల్లేదు. మెరుపులాంటి ఓ ఆలోచనతట్టి గబగబా ఇంట్లోకి నడిచాడు పరంధామయ్య.

సీజను మొత్తంమీద తగలక తగలక తగిలిన ఈ ఒక్క పెళ్ళి యిలా తగలబడితే మరి మామ్మగారికి కావాలనుకున్న చీరసంగతి ? ఏం చెయ్యాలా ?' అని పౌరోహిత్యులు పాపయ్య పంతులుగారు నెత్తికి చేతులు పెట్టుకుని బొక్క నోరు తెరుచుకుని అలా ఆలోచనగా వుండిపోయారు,

'అందాక యివి వుంచండి. తెల్లారి మరో తంటాలు పడి సర్దుతాను. ముహూర్తం మించిపోకుండా పని కానివ్వండి.' అని తనభార్య కట్టుకున్న పట్టుబట్టలు పదిలంగా మడతపెట్టి ప్రాధేయపూర్వకంగా భూషయ్యచేతిలో వుంచాడు పరంధామయ్య కొరడా చెయ్యక్రింద.

'అబ్బబ్బ ! భజినికి బంకలా తగులుకున్నావేమయ్యా!' తనకు తగని యిలాంటి దరిద్రపు సంబంధం చెయ్యడం నాదే పొరపాటు,' వాపోతుకుంటూ బట్టలందుకున్న భూషయ్య.—

అందాక యివి వుంచుతాను. తెల్లారేసరికి కొరతా కేష్ చెల్లిస్తేనే శోభనం. ముందే చెప్తున్నాను. తర్వాత పేచీ కాదు. ఊం. కట్టరా అబ్బాయి !' ఆర్డరు జారీచేశాడు హోదాగా జీకటింగిస్తూ.

* * *





బనియన్ల తయారీలలో మాదొక

ప్రత్యేకత

అందుకే...

"టిప్ టాప్ బనియన్లు"

నాణ్యమునకు ప్రసిద్ధి చెందియున్నది.

"టిప్ టాప్"

బనియన్లు కొని ధరించి ఆనందించండి.

తయారించువారు :

Tip Top Hosiery Mfrs.,

35-28, Dharapuram Road,

TIRUPUR - 638 604.

తుఫాను అనంతరం ప్రకాశంగా ఉదయించే సూర్య బింబంలా పరంధామయ్య ముఖం ఆనందంతో వికసించింది.

అంతవరకూ జరిగిందంతా గమనిస్తున్న పెళ్ళికూతురు ముఖం కోపంతో చింతనిప్పులా మారింది. చిచ్చరపిడుగులా, పెళ్ళిపీటలనుంచి దిగ్గునలేచి, ఒక్కవూపులో భూషయ్య ముందుకువచ్చి—

'చూడండి మిస్టర్ భూషయ్యగారూ! తాళి కట్టటానికి ఆర్డరు మీరు జారీ చేసినా, కట్టించుకుందికి నేను సిద్ధంగా లేను, నీలా మాకు ఐశ్వర్యం, అహంకారం లేకపోవచ్చు. కానీ, నీతి-నిజాయితీ, మానుషం, పౌరుషం వున్నాయి. అన్నిటికీమించిన ఆత్మాభిమానం కలవాళ్ళం. ఆడబిడ్డను కన్నవాళ్ళు దరిద్రులయితే మగ మహానుభావుల్నికన్న మీరు కిరాతకులు, పిశాచులు. మానవత్వంలేని మృగాలు. డబ్బు కోసం గడ్డికరిచే మీయింట, వ్యక్తిత్వంలేని యిలాంటి భర్తతో కాపురం చేసేందుకు నా మనసంగీకరించలేదు. లక్షణమైన లక్షాధికారి కూతుర్ని తెచ్చుకుని లక్షలకట్నంతో మీ గంగిరెద్దుకు లాంఛనంగా పెళ్ళి చెయ్యండి' అని మండిపడింది.

తలవంచుకోవలసిన పెళ్ళికూతురు భవిష్యత్తు ఏమవుతుందోనన్న భయంలేకుండా, పదిమందిలో కాబోయే మామగార్ని మర్యాదలేకుండా చిత్తం వచ్చినట్లు అనేసరికి పరంధామయ్యకు కోపం ఆగలేదు.

'రాధా! ఏమిటిది? పెళ్ళంటే పరాచకాలనుకున్నావా?' కళ్ళెర్రచేసాడు.

'పరాచకాలు కాదు నాన్నా! యీ రాక్షసులు వరకట్నపు చదరంగంలో మనల్ని పావులుగాచేసి ఆడుకునే 'క్రైమ్ కిల్లింగ్ గేమ్' అని యిపుడే అర్థమయింది.

'నోర్మూయ్. ఆమాత్రం పౌరుషం నాకుమాత్రం లేదనుకున్నావా? పీటలమీద పెళ్ళి ఆగిపోతే నీ పరువూ - నిన్ను కన్న నా పరువు మంటగలుస్తుందని ఎన్నన్నా భరించాను. సహించాను. ఎవరికోసం? నీకోసం. ఆమాత్రం ఇంగితజ్ఞానం లేదూ.' ఆవేశాన్ని ఆపుకోలేని పరంధామయ్య రాధ చెంప చెల్లుమనిపించాడు. 'నువ్వు ఆడదానివమ్మా!' పొంగి వస్తున్న దుఃఖంతో కూతురు తల నిమురుతూ బావురుమన్నాడు తన తొందరపాటుకు పశ్చాత్తాపపడ్తూ.

'నేను ఆడదాన్నని నాకు తెలుసు నాన్నా.' ఆడదానిగా పుట్టిననేరానికి మేము ఆ ఆడబిడ్డకు జన్మ యిచ్చిన పాపానికి మీరు యీ సమాజాన్ని ఎదిరించలేక కుక్కినపేనుల్లా పడివుంటూ యింతకాలం యీవ్యవస్థను ఈ దుస్థితికి తీసుకు వచ్చారు. యిపుడు పోయింది మన పరువుకాదు నాన్నా! యిదుగో వీరిది మా మాజీ మామగారిది.'

'వాళ్ళకేమమ్మా! మగపెళ్ళివారు. బజారున పడేది మనమేనమ్మా! ఆడపిల్లగలవాళ్ళం! ఆరోజులు పోయాయి నాన్నా! ఆడబ్రతుకులకు, ఆడపిల్లల్నికన్న నీలాంటి అమాయకులకు రక్షణ కల్పించటానికే నాన్నా! ప్రభుత్వం రూపొందించిన 'వరకట్న నిషేధచట్టం' అది కళ్ళు తెరచిన నాడు ఈలాంటి ప్రిస్టేజీ బ్రతుకులన్నీ కష్టడీకి రాక పోవు'' అంటూ కసిగా భూషయ్య నుద్దేశిస్తూ.

'పంచభక్షపరమాన్నాలను పాషాణానికి అర్పించినా ముక్తీ మోక్షం వుండదు. ఆత్మాభిమానంకల ఓ ముష్టి వాడికి పిడికెడు మెతుకులువేస్తే ఆనందించి ఆకలి తీర్చుకుని తృప్తిపడ్తాను ఆస్తి అందం కాదు. ఆడదానికి కావలసింది అనురాగం, ఆత్మవిశ్వాసం వున్నభర్త. యింకేమిటి. ఆలోచిస్తున్నావు? కోరీ కోరనట్లు 'బావ' వచ్చాడు. ఆ సొమ్ముంతా సగం అతనికేయిచ్చి, అతనికాళ్లు కడగండి నాన్నా!'

'అమ్మా!'

తండ్రి ఏం చేస్తాడోకూడా ఎదురుచూడకుండా పరంధామయ్యచేతికి సూటుకేసు తీసుకుని పెళ్ళి చూడాలని చుట్టం చూపుగా వచ్చిన 'మధు' రెక్క అందుకుని పీటలమీద కూర్చోబెట్టి, తాళిబొట్టు, సూటుకేసు అందించి మెడవంచుకుని కూర్చుంది రాధ.

మళ్ళీ భజంత్రీలు మ్రోగాయి.

పాపయ్య పంతులుగారు బొక్కినోరు ఆడిస్తూ దడదడా మంత్రాలు చదవడం ప్రారంభించారు.

'కళ్ళల్లో పెళ్ళిపందిరి' పాట ప్రారంభమైంది, మళ్ళీ.

సిగ్గుతో తల దించుకున్న రాధమెడలో మూడు ముళ్లు వేసాడు.' ఏక్సిడెంటల్ పెళ్ళికొడుకు 'మధు'.

'కుక్కకాటుకు చెప్పుదెబ్బ'లా వరకట్నదాహంతో కళ్ళు నెత్తికెక్కిన భూషయ్యకు బుద్ధిచెప్పిన రాధ తెలివితేటలకు, నిర్ణయానికి నివ్వెరపోతున్న జనాల చేతులు అక్షింతలవర్షం కురిపించాయి నవదంపతులమీద.

ఆడబిడ్డ తండ్రిని అవమానింపబోయి, తను పదిమందిలో అవమానింపబడ్డ మగబిడ్డనుకన్న మహామనిషి భూషయ్య తోకముడుచుకుని గప్‌చిప్‌గా గల్లంతయాడు కొడుకుతో సహా.